పేదల బాగు కోసమే సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని
- జీవీఎంసీ 9వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



జోడుగుళ్లపాలెంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: పేద ప్రజలు బాగుండాలనే ఆలోచనతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 9వ వార్డులో మంగళవారం ఆమె స్థానిక కార్పొరేటర్ స్వాతితో కలసి గపడగపడకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. వార్డు పరిధి జోడుగుళ్లపాలెం, దయాల్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. వాటి గురించి వివరించారు. పథకాల లబ్ధిపై అవగాహన కల్పించారు. ఏ ఇంటిలో సభ్యులకు ఏయే పథకాలు అందాయో అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేసి బురదజల్లుతున్నాయని ధ్వజమెత్తారు. అసత్య ప్రచారాలు చేయడానికి బహిరంగ సభలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు ఆమె సూచించారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా సచివాలయాల్లో సిబ్బందికి తెలియజేయాలన్నారు. సచివాలయాల సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయికి ఘన నివాళి



సావిత్రిబాయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



ఎంవీపీ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఏయూ క్యాంపస్: సామాజిక మార్పునకు నాంది పలికిన సావిత్రిభాయి జీవితం నేటి తరానికి ఆదర్శమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా ఏయూ పరిపాలన భవనంలో ఆమె చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో మహిళా విద్యకు నాందిగా వారు స్థాపించిన పాఠశాలలు నిలిచాయన్నా రు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య సుదర్శనరావు, పితాని ప్రసాద్, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

ఆరిలోవ: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఆరిలోవలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత ముఖ్యఅతిథిగా పాల్గొని సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి లాంటి సంఘ సంస్కర్తను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి గెయిల్ ఇండియా సీఎండీ ఎల్.ఎస్.రావు, జాతీయ ఓబీసీ అధ్యక్షుడు పోతల ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో విజ్ఞాన వెలుగులు నింపేందుకు సావిత్రిబాయి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు విశేష సేవలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలుర గృహంలో టీచర్ వలంటీర్ల పోస్టులు

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం దీన్‌దయాల్ పురం వద్ద ప్రభుత్వ బాలుర గృహంలో టీచర్ వలంటీర్ల కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్షా అభియాన్ అదనపు సమన్వయకర్త పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి మాత్రమే వలంటీర్ ఉపాధ్యాయులు అవసరమని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు డీ.ఎడ్, లేదంటే డిగ్రీతో పాటు బీఈడీ చదివినవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 6వ తేదీలోగా రూరల్ మండలం కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. ఎంపికై న వారికి నెలకు రూ.7,500 వేతనం నిర్ణయించినట్లు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వి.రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

5న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 5న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

'మణిదీపాలు' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: రచయిత్రి సాలిపల్లి మంగామణి రచించిన ' మణి దీపాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరై కవితా సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపకులు నందూరి రామకృష్ణ, విశ్రాంత ఆచార్యులు సజ్జా మోహన్‌రావు, సాహితీవేత్తలు నవ సాహిత్య ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ఎస్.వి.సూర్యప్రకాశరావు, ఆర్ అండ్ బి డీఈ ఆర్.ఆర్. విద్యాసాగర్,తెలుగు ఉపన్యాసకులు బి.రజిని పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

సీతమ్మధార (విశాఖ ఉత్తర): ఫోర్తు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి డీఎల్‌వో జంక్షన్‌దరిలో ఫుట్‌పాత్‌పై గత నెల 20న ఫిట్స్ వచ్చి పడిపోయిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు..ఫిట్స్ వచ్చి పడిపోయిన వ్యక్తిని స్థానికులు సపర్యలు చేసి 108లో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఎస్‌ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విస్తృతంగా జీబ్రా లైన్స్ ఏర్పాటు



పనులను పరిశీలిస్తున్న సీఐ తదితరులు

ఎంవీపీ కాలనీ: స్థానిక ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా లైన్స్ ఏర్పాటు పనులు మంగళవారం చురుగ్గా జరిగాయి. జాతీయ రహదారితో పాటు హెచ్‌బీ కాలనీ, ఎంవీపీ కాలనీ, అప్పుఘర్ తదితర ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టారు. ఎంవీపీ ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు ఆయా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనదారుల అవసరాల మేరకు ఈ పనులు చేపట్టినట్టు తెలిపారు. హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, అప్పుఘర్, వీఎంఆర్‌డీఏ రోప్ వేతో పాటు ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. పలు చోట్ల స్పీడ్ బ్రేకర్ల నిర్మాణంతో పాటు జీబ్రా లైన్ పెయింటింగ్ పనులు చేపట్టామన్నారు.

సమాచారమ్

అల్లూరి స్టడీ సర్కిల్‌లో గ్రూప్‌-2 శిక్షణ

డాబాగార్డెన్స్: అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అల్లూరి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్‌–2 అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు కేంద్రం కార్యదర్శి బి.గంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా http://shorturl.at/mvyF3 లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 16వ తేదీ ఆఖరని, ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. పూర్తి వివరాలకు 80084 12798 ఫోన్ నంబరులో గానీ, లేదా డాబాగార్డెన్స్, లలితానగర్(బాటా షోరూమ్ ఎదురుగా రోడ్డు)లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించవచ్చునని ఆయన పేర్కొన్నారు.

కాలుష్య కారకాలపై అవగాహన అవసరం

ఎంవీపీ కాలనీ: కాలుష్య కారకాల వల్ల ప్రభావితమయ్యే పర్యావరణ పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన అవసరమని జీవీఎంసీ అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు అన్నారు. అశ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పబ్లిక్ స్కూల్, వైజాగ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 120 మైక్రాన్స్ కంటే తక్కువ ప్లాస్టిక్‌ను భారత ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఈ ప్లాస్టిక్ కారణంగా జరిగే నష్టంతో పాటు కాలుష్యం కారణంగా వెలువడే కార్బన ఉద్గారాలు ప్రభావాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కాపులుప్పాడ డంపింగ్‌యార్డ్‌లో జరుగుతున్న రీసైక్లింగ్ ప్రాసెస్‌ను విద్యార్థులు పరిశీలించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శాస్త్రీ, సుంకరి రవీంద్ర, దివ్యాదాస్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలస్థితిలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్



కూలిన భద్రత గోడ



బీటలు వారిన గోడ

బీచ్ రోడ్డు: పెదవాల్తేరులోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌తో పాటు, సీటీ క్రైమ్ సీఐ, సీటీ ట్రాఫిక్ సీఐలు ఉంటారు. నగరంలో పోలీసు కమిషనరేట్ తరువాత ప్రాధాన్యం ఉన్న ఈ స్టేషన్‌కు సరైన భద్రత లేకపోవడంపై అందర్నీ ఆందోళన కలిగిస్తోంది. స్టేషన్ ఆవరణలోని భద్రత గోడ కూలిపోయింది. గోడల పెచ్చులూడి పడుతున్నాయి. ఇప్పటికే మెట్లు కూలిపోయాయి. మరికొద్ది రోజుల్లో సీలింగ్ కూడా కూలిపోయే పరిస్థితి నెలకొంది. భవనంతో పాటు ప్రాంగణం కూడా భద్రత లోపం ఉండడంతో నిందితులు సైతం పరారు కావడానికి అవకాశాలు ఉన్నాయి. గత నెలలో డ్రగ్స్ కేసులో అరెస్ట్ అయిన నిందితుడు మూత్రానికి వెళ్తానని చెప్పి ఈ పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకున్నాడు. ఈ ఘటనతో మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో భద్రత డొల్లతనం బయటపడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవనానికి మరమ్మతులు చేపట్టి, భద్రత చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నగర పోలీస్ జట్టుకు సీపీ అభినందనలు



పోలీస్ క్రికెట్ జట్టు సభ్యులను అభినందిస్తున్న సీపీ సీహెచ్.శ్రీకాంత్, తదితరులు

అల్లిపురం: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంస్థాగత క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో 2022 సంవత్సరానికి నగర పోలీస్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ జట్టు సభ్యులను కార్యాలయానికి మంగళవారం పిలిపించి అభినందనలు తెలియజేశారు. ఉత్తమ బ్యాట్స్‌మన్‌గా ఎంపికైన పోలీస్ టీం కెప్టెన్ వి.త్రినాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నగర క్రికెట్ పోలీస్ టీం ఇన్‌చార్జి ఇమ్మానుయేల్ రాజు, ఇన్‌స్పెక్టర్(ఆరిలోవ), ఎస్‌ఐ శ్రీకాంత్ (స్టీల్‌ప్లాంట్) పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



అఖిల్ అలీషా(ఫైల్)

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): జాతీయ రహదారిపై లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. విమానాశ్రయం జంక్షన్ దాటి మొదటి వంతెన వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పాత ఐటీఐ జంక్షన్ సమీపంలో నివాసముంటున్న మహమ్మద్ అఖిల్ అలీషా(73) గాజువాకలో పని ఉండడంతో స్కూటీపై వెళ్తున్నాడు. విమానాశ్రయం దాటిన తర్వాత జాతీయ రహదారిపై మొదటి వంతెన వద్దకు వచ్చే సరికి వెనుకనే వస్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అలీషా కింద పడిపోగా.. ఆయన కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యాయి. తలకు కూడా గాయమవడంతో.. అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక మసీదులో ఆయన సేవలందిస్తున్నారు. కుమారుడి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీని స్వాధీనం చేసుకుని.. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఆక్రమణల తొలగింపు



రేకుల షెడ్డును తొలగిస్తున్న రైల్వే అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం శ్మశాన వాటిక వెనుక రోడ్డులోని విజయనగర్ కాలనీలో రైల్వే స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును రైల్వే అధికారులు తొలగించారు. గతంలో ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించగా తొలగించినట్లుగా అధికారులు చెబుతున్నారు. నిర్మాణ సమయంలో సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ హెచ్చరించినా నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణ విషయం రైల్వే అధికారుల దృష్టికి రావడంతో తొలగింపు చేపట్టారు. ఏఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో తొలగింపులు జరిగాయి. మరో మారు నిర్మాణం చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

ఏయూ సమాచారం

డిఫెన్స్ చైర్ ఏర్పాటుకు ప్రతిపాదన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డిఫెన్స్ చైర్‌ను ఏర్పాటు చేయాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రతిపాదించారు. మంగళవారం ఉదయం ఆయన వర్చువల్ విధానంలో భారత రక్షణ మంత్రిత్వ శాఖ డీజీఆర్ డైరెక్టర్ జనరల్ శరద్ కపూర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ డిఫెన్స్ కాలేజీలో చదువుతున్న అధికారులకు ఏయూలో ఎగ్జిక్యూటివ్ పీహెచ్(స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్)లో ప్రవేశం కల్పించే విధంగా ఎంవోయూ చేసుకోవాలని నిర్ణయించారు. రక్షణ రంగాల అధికారులకు రెండు సెమిస్టర్ల ఫైర్ సబ్ ఆఫీసర్ కోర్సును ఏయూలో నిర్వహించడానికి సూత్రప్రాయంగా అంగీకరించారు. స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్‌లో నాలుగు సెమిస్టర్ల ఆన్‌లైన్ ఎంబీఏ కోర్సు నిర్వహణ, స్టార్టప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగంలో అవసరమైన మార్గదర్శకాన్ని రక్షణ రంగాల అధికారులు అందించే దిశగా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సమన్వయకర్త డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం




దీక్షలో పాల్గొన్న ఆందోళనకారులు

సీతమ్మధార : సేవలతో ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి బోగవెల్లి నాగభూషణం పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరాహార దీక్షలు 642వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.తాత బాబు, ఉపాధ్యక్షుడు పీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

12 తులాల బంగారు ఆభరణాలు చోరీ

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఉళ్లపేట – సంగివలసకు చెందిన ములుపురి కిషోర్ ఇంట్లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు 12 తులాల బంగారు ఆభరణాలు, వెండి కుంకుమ బరిణె చోరీ చేశారు. కిషోర్ డివీస్‌లో ఉద్యోగానికి వెళ్లిపోగా అతని భార్య గోపీబాల మామయ్యను తీసుకుని ఉదయం 11.30 సమయంలో సంగివలస ఎన్‌ఆర్ ఆస్పత్రికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు వచ్చారు. ఇంటి మెయిన్‌గేటుతోపాటు బీరువా తెరిచి ఉండడంతో అందులో చూడగా ఆభరణాలు కనిపించ లేదు. వెంటనే ఆమె భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్రైమ్ ఎస్‌ఐ సూర్యప్రకాష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్యుకేషనల్ టెక్నాలజీ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, సహాయ ఆచార్యుడు డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.ప్రకాశరావు సంయుక్తంగా రచించిన ×ఎడ్యుకేషనల్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ॰పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం పుస్తక రచయితలను వీసీ అభినందించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా వర్తమాన అంశాలపై పుస్తక రచన చేయడంపై అభినందనలు తెలియజేశారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.1.3 లక్షలు మాయం

కూర్మన్నపాలెం: తన బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమవుతున్నాయని ఉక్కు ఉద్యోగి దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి రాయి అప్పారావు గత నెల 29వ తేదీన కూర్మన్నపాలెం కూడలిలో ఉన్న మోర్ సూపర్ మార్కెట్ పక్కన గల ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేశారు. అప్పటి నుంచి అప్పారావు బ్యాంకు ఖాతా నుంచి దఫదఫాలుగా మొత్తం 1 లక్ష 30 వేల రూపాయలు మాయం అయ్యాయి. దీంతో ఆందోళన చెందిన బాధితుడు దువ్వాడ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేసే సమయంలో తన పక్కన ఓ మహిళ ఉందని, ఆమె తన ఏటీఎం కార్డును మాయం చేసి డబ్బులు తీసుకుంటున్నట్లు అనుమానం ఉందని అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. దువ్వాడ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిజం విభాగాధిపతికి అభినందనలు



వినయ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న రామకృష్ణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సి.ఎం.వినయకుమార్‌ను అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. సీనియర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, ఏయూ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ తదితరులు డాక్టర్ వినయకుమార్‌కు అభినందనలు తెలిపారు.

దివంగత నటీమణి భానుమతి సేవలు ఆదర్శప్రాయం



సీవీ రాజేశ్వరిని సత్కరిస్తున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ జీఎస్ఎన్ రాజు, వీవీ రమణమూర్తి

అల్లిపురం: చిత్ర రంగానికి డాక్టర్ భానుమతి రామకృష్ణ చేసిన సేవల్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. ప్రఖ్యాత గాయని, నటి డాక్టర్. పి.భానుమతి వర్ధంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో భానుమతి పాట.. సీవీ రాజేశ్వరి నోట అనే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ భానుమతి గాయనిగా, నటిగా, స్టూడియో అధినేత్రిగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా చిరస్మరణీయమైన సేవలు అందించారన్నారు. భానుమతి స్మారకార్థం సీవీ రాజేశ్వరి ఇటువంటి పాట కచేరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ వృత్తి ఏయూ, ప్రవృత్తి గానంగా చేసుకుని ప్రత్యేక గుర్తింపు పొందిన రాజేశ్వరి గానం ప్రశంసనీయమన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ భానుమతి చిత్ర గీతాలు అన్ని వర్గాల ప్రజల హృదయాల్లో నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు పాడిన ఆకాశవీధిలో హాయిగా, నీటిలోన నింగిలోన, జాబిలి ఓ జాబిలితో పాటు ఓహో ఓహో పావురమా, కన్నులే నీకోసం వంటి పాటలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సన్‌మూర్తి, కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ రాజేశ్వరిని ముఖ్య అతిథులు సత్కరించారు.

భెల్ ఈడీని కలిసిన హెచ్‌బీఎస్ కమిటీ

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఈడీ జితేందర్ రెడ్డిని బీహెచ్‌పీవీ హౌస్ బిల్డింగ్ సొసైటీ (హెచ్‌బీఎస్) 3వ ఫేజ్ విశ్రాంత ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థ పరిపాలనా భవనంలో ఈడీ ఛాంబర్‌లో ఆయన్ను కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న 3వ ఫేజ్ గృహ నిర్మాణం విషయంలో మేనేజ్‌మెంట్ సహాయ సహకారాలపై స్పందించాలని కోరారు. ఈడీని కలిసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రతినిధులు రామారావు, పి.శంకర్రావు, డి.పార్వతీశం, గొంది నవీన్ తదితరులున్నారు.

ఏడు కిలోల గంజాయి స్వాధీనం

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లిలో మంగళవారం కారులో తరలిస్తున్న ఏడు కిలోల గంజాయితో పాటు ఇద్దరిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, పెందుర్తి పోలీసులు కలిసి పట్టుకున్నారు. పెందుర్తి సీఐ అప్పారావు తెలిపిన వివరాలు.. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి చెందిన సారిపల్లి దుర్గాప్రసాద్ (28), విజయనగరానికి చెందిన తంగేటి భరత్ (30)కారులో ఎస్. కోట నుంచి విశాఖకు కారులో గంజాయి తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్, పెందుర్తి పోలీసులు సరిపల్లి దగ్గర కారుని ఆపి తనిఖీ చేశారు. ఏడు కిలోల గంజాయితో పాటు కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా పట్టుబడిన ఇద్దరిపై పాత కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వెంకన్నగా దర్శనమిచ్చిన అప్పన్న



సింహగిరి మాడ వీధిల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి మంగళవారం వేంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెంకన్నగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.